క్లుప్తంగా

రేపటి నుంచి సోలార్ ఉత్పత్తుల ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఈ నెల 28 నుంచి జరుగనున్న రిన్యూవబుల్ ఎనర్జీ రిన్యూ ఎక్స్ ట్రేడ్ ఎక్స్‌పోలో సోలార్ ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్టు గోల్డి సోలార్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ రెండు రోజుల ప్రదర్శనలో పవర్ అవుట్‌పుట్ 520 డబ్ల్యూఎంపీ నుంచి 550 డబ్ల్యూఎంపీ వరకూ ఉండేవి, హెల్లోక్(ఆర్), డీసీఆర్ మాడ్యూల్స్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు.

ఆలయంలోకి వరద నీరు



తుల్జాభవానీ ఆలయంలోకి వచ్చిన వరద నీరు

శేరిలింగంపల్లి: తారానగర్‌లోని తుల్జాభవానీ ఆలయంలోకి వరద నీరు చేరింది. మంగళవారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి వచ్చిన వరద నీరు ఆలయం ముందు భాగంలో భారీగా చేరింది. అక్కడ నుంచి వరద తుల్జా భవానీ ఆలయంలోకి ప్రవాహం కొనసాగింది. దీంతో ఆలయంలోకి వరదతో పాటు చెత్తా చెదారం కూడా చేరింది. వరదనీరు ఆలయంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులను స్థానికులు కోరుతున్నారు.

హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



బ్రోచర్‌ను విడదల చేస్తున్న మోడల్స్ తదితరులు

మాదాపూర్: హైలైఫ్ ఎగ్జిబిషన్ నగరవాసులను ఆకట్టుకోనుందని బాలీవుడు నటి వినాలి భట్నాగర్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో బుధవారం మూడు రోజుల పాటు నిర్వహించనున్న హైలైఫ్ ఎగ్జిబిషన్‌కి సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. మే 7, 8, 9 వ తేదీలలో ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఎగ్జిబిషన్‌లో క్రియేటీవ్ ఫ్యాషన్‌వేర్, లైఫ్‌స్టైల్ వేర్, బ్రైడల్‌వేర్, డిజైనర్ వేర్, యాసనరీస్, జ్యూలరీలతో పాటు ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మోడల్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక వంటల తయారీపై తరగతులు



వంటకాల తయారీ విధానాన్ని తెలుపుతున్న చెఫ్ సారాంశ్ గొయిలా

మాదాపూర్: మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో కొనోష్ సంస్థ ఇండియన్ స్టోరీస్ విత్ గ్యారీ అండ్ ఫ్రెండ్స్ పేరిట యూనిక్ నిర్వహిస్తోంది. బుధవారం ఈ సిరీస్‌కి సంబంధించిన చెఫ్‌లతో ఈ మాస్టర్ క్లాస్ నిర్వహించారు. ప్రముఖ మాస్టర్ చెఫ్‌లు గ్యారీ మెహిగాన్, చెఫ్ సారాంశ్ గొయిలా ప్రత్యేక వంటకాలను తయారు చేసి అలరించారు. కొనోష్ వ్యవస్థాపకురాలు నేబమాలిక్ మాట్లాడుతూ, వంటకాలు తయారీలో ఎవరికివారే సాటి అని తెలిపారు. ఆన్‌లైన్ (సిరీస్) ద్వారా నూతన వంటకాలను పరిచయం చేస్తున్నామన్నారు.

నియామకం

రాయదుర్గం: అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్ శాఖ నూతన అధ్యక్షుడిగా అక్షయ్ అంగుల్‌వార్, కార్యదర్శిగా ఆకాశ్‌భాటిలను నియమించారు. ఈ విషయాన్ని బుధవారం ఏబీవీపీ హెచ్‌సీయూ మాజీ అధ్యక్షురాలు నమ్రతాసింగ్ వెల్లడించారు. వర్సిటీ క్యాంపస్‌లో మంగళవారం రాత్రి జరిగిన ఏబీవీపీ హెచ్‌సీయూ శాఖ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై ఏబీవీపీ జాతీయ జాయింట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలకృష్ణ వీరి నియామకాన్ని ప్రకటించారని చెప్పారు. నూతన అధ్యక్షుడు అక్షయ్ అంగుల్‌వార్, కార్యదర్శి ఆకాశ్‌భాటిలను నమ్రతాసింగ్‌తో పాటు పలువురు ఏబీవీపీ జాతీయ, రాష్ట్ర, హెచ్‌సీయూ నాయకులు అభినందించారు.



అక్షయ్ అంగుల్‌వార్



ఆకాశ్‌భాటి



హుడా కాలనీలో నిరుపయోగంగా ఉన్న చేతి పంపు



ఎంఏనగర్ కాలనీలో ..



శ్రీరాంనగర్ కాలనీలో..

బోరింగ్..నో కేరింగ్!

- మరమ్మతు లేక తుప్పుపట్టిపోతున్న వైనం
- చందానగర్, మియాపూర్‌లో నిరుపయోగంగా ఉన్న హ్యాండ్‌బోర్లు
- బాగు చేసి వాడుకలోకి తేవాలని బస్తీవాసుల విజ్ఞప్తి

మియాపూర్: లక్షల రూపాయాలు ఖర్చు చేసి వేసిన చేతి బోర్లు ప్రస్తుతం తుప్పు పట్టి నిరుపయోగంగా మారాయి. చాలాకాలం క్రితం బస్తీలు, కాలనీల్లో వేసిన బోరింగ్ (హ్యాండ్‌బోర్లు) లకు మరమ్మతులు చేయించేందుకు జలమండలి అధికారులు ముందుకు రావడంలేదు. ప్రస్తుతం ఎండకాలం.. జలమండలి సరఫరా చేస్తున్న నీరు సరిపోకపోవడంతో స్థానికులు నీటికి ఇబ్బంది పడుతున్నారు. అధికారులు నిరుపయోగంగా ఉన్న బోర్లకు మరమ్మతు చేయించి వాడుకలోకి తీసుకొస్తే తాము నీటి కష్టాల నుంచి బయట పడతామని బస్తీల ప్రజలు పేర్కొంటున్నారు.

- చందానగర్, మియాపూర్ డివిజన్ల పరిధిలోని ఇందిరానగర్, శాంతినగర్, వేముకుంట, జవహర్ కాలనీ, వేమన వీకర్ సెక్షన్, న్యూ కాలనీ, బాలాజీనగర్, ఎఫ్‌సీఐ కాలనీ, లక్ష్మీనగర్, వీడియో కాలనీ, పీఏనగర్, ఎంఏనగర్, స్టాలిన్‌నగర్, హుడా కాలనీ తదితర కాలనీల్లో హ్యాండ్ బోర్లు నిరుపయోగంగా ఉన్నాయి.
- బస్తీలు, కాలనీల్లో నల్లాల ద్వారా మంచినీటి సరఫరా చేస్తుండటంతో బోరింగ్‌ల మరమ్మతులను అధికారులు పట్టించుకోకపోవడం వల్ల అవి తుప్పు పట్టిపోతున్నాయి.
- అయితే, నల్లాల ద్వారా రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్న మంచినీరు సరిపడకపోవడంతో బస్తీ, కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. హ్యాండ్ బోర్లు పని చేస్తుంటే ఆ నీటిని తాము వాడుకొనే వాళ్లమని వారు అంటున్నారు.
- బోరింగ్‌లకు మరమ్మతులు చేయించాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- అయితే, కాలనీలోని బోర్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తున్నామని స్థానిక జలమండలి అధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తూ నిధులు దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- కేవలం కాగితాలకే మరమ్మతులు పరిమితం అవుతున్నాయని, ఉన్నతాధికారులు బస్తీలకు వచ్చి ప్రత్యక్షంగా బోర్లను పరిశీలిస్తే అసలు విషయం తెలుస్తుందని ప్రజలు అంటున్నారు.
- ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలనీల్లో నిరుపయోగంగా ఉన్న బోర్లకు మరమ్మతు చేయించి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

వాడుకలోకి తీసుకురావాలి

ఒకప్పుడు బస్తీలకు నీటిని అందించిన హ్యాండ్ బోర్లు నేడు నిరుపయోగంగా మారాయి. మరమ్మతులు చేయించకపోవడంతో తుప్పు పట్టిపోయాయి. మరమ్మతులు చేయకుండా మరమ్మతు పేర్లతో లక్షల రూపాయలు పక్కదారి పడుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిరుపయోగంగా ఉన్న హ్యాండ్ బోర్లకు మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకురావాలి.

– మహేష్, న్యూ కాలనీ వాసి

ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే ధ్యేయం



తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్: ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీ, సాయినగర్, మయూరీనగర్, బాలాజీనగర్ కాలనీల్లో జలమండలి ఆధ్వర్యంలో రూ.46 లక్షల వ్యయంతో చేపట్టబోయే మంజీరా తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మిషన్ భగీరథ ద్వారా 18 రిజర్వాయర్లు నిర్మాణం చేపట్టి ప్రతి కాలనీలో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసుకొని ఇంటింటికీ స్వచ్ఛమైన నీరు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వాల పాలనలో మహిళలు తాగునీటి కోసం బిందెలు పట్టుకొని నిల్చుండేవారని, ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామన్నారు. తాగునీటి పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన నెలకు 20 వేల లీటర్ల ఉచిత తాగునీటి పథకం ద్వారా నీటిని అందిస్తున్నామన్నారు. అర్హులైన వినియోగదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్ సాయిచరిత, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన ...

మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ, మక్తమహబూబ్‌పేట, పటేల్ చెరువు ఇన్‌లేట్, దీప్తీ శ్రీనగర్ నాలాను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అకాల వర్షాల కారణంగా రోడ్లపై పేరుకుపోయిన మట్టిని వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశించారు. అదే విధంగా వర్షాకాలం లోపు నాలాలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి వరద నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్, శివ, జగదీష్, నరేష్ తదితరులున్నారు.

డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



అధికారులు, సిబ్బందితో సమస్యలపై చర్చించిన కార్పొరేటర్

మోతీనగర్: వివేకానందనగర్ వార్డు కార్యాలయంలో వాటర్ వర్క్స్, డ్రైనేజీ సిబ్బందితో బుధవారం అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... డివిజన్‌లో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేయాలని సూచించారు. డ్రైనేజీ నుంచి తీసిన వ్యర్థాలను అక్కడే ఉంచకుండా తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. అదే విధంగా నీటి సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం రాజీవ్‌గాంధీనగర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. నిలిచిన వర్షపునీటిని, బురదని వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ వీరారెడ్డి, ఎస్‌సీ సెల్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

‘తెలంగాణను బీఆర్ఎస్ రావణకాష్టంగా మార్చింది’

బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జల యోగానంద్



దీనబంధు కాలనీలో సమస్యలను పరిశీలిస్తున్న గజ్జల యోగానంద్

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని కూకట్‌పల్లి డివిజన్ పార్టు-2 దీనబంధు కాలనీలో బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జల యోగానంద్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ 9 ఏళ్ల పాలనలో రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు రాష్ట్ర పరిస్థితి ఉందన్నారు. డబల్ బెడ్‌రూమ్ ఇళ్లులు, దళిత బంధు, దళితులకు మూడు ఎకరాల భూమి, రైతులకు రుణ మాఫీ, రైతు బంధు, వృద్ధులకు పెన్షన్, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి వంటి ఎన్నో అబద్ధపు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ ఇంత వరకు ఏ పథకాలను సక్రమంగా అమలు చేయలేకపోయిందన్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రజల సమస్యలు పట్టించుకోకుండా నిద్రపోతున్నారని విమర్శించారు.ఆయనకు కబ్జాలు చేయడానికి భూములు తప్ప, పరిష్కరించడానికి ప్రజా సమస్యలు కళ్లకు కనపడవని అన్నారు. త్వరలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూపాల్‌రెడ్డి, గంగుల రాజిరెడ్డి, నీలం సంధ్య, శ్రీలత, పుప్పాల ప్రభాకర్, ప్రకాష్, మహేందర్, సుకన్య, మాధురి, జ్యోతి, లత, అరుణ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

సీఈఐఆర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): పోయిన సెల్‌ఫోన్‌ను తిరిగి పొందేందుకు కేంద్ర టెలికాం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన సీఈఐఆర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గుమ్మడిదల ఎస్ఐ విజయకృష్ణ సూచించారు. నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మల్లేశం అనే వ్యక్తి పాల వ్యాపారం చేస్తుంటాడు. మల్లేశంకు సంబంధించిన సెల్‌ఫోన్ ఈనెల 3న పోయింది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ విజయకృష్ణ ఆధ్వర్యంలో దర్యాప్తును చేపట్టారు. కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ రూపొందించిన సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్)ద్వారా మల్లేశం పొగొట్టుకున్న ఫోన్‌ను రికవరీ చేసి ఫోన్‌ను మల్లేశ్‌కు అందజేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో బుధవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ పుష్పనగేష్, జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ బాలయ్య దృష్టికి తీసుకురాగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ నిచ్చారు. అనంతరం కాలనీవాసులు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటివెలుగు పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెల్లాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లిలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శంషాబాద్ రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంటల పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): అకాల వర్షాలు కురుస్తుండటంతో గుమ్మడిదల మండలంలోని ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను వ్యవసాయశాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షం పడుతున్న సమయంలో రైతులు పంటపొలంలో నీళ్లు లేకుండా చూసుకోవాలన్నారు. వర్షం పడుతున్న సమయంలో ఎలాంటి మందులను పిచికారి చేయొద్దని సూచించారు. ప్రస్తుతం పంట నష్టంలేదని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమకు తెలియజేయాలన్నారు.

వర్షపునీరు నిల్వకుండా చర్యలు

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని కాలనీలలో రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కాలనీలలో రోడ్లపై వర్షపు నీరు నిలిచి కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాచారం తెలుసుకున్న కార్పొరేటర్ శాంతినగర్ కాలనీ, అంబేడ్కర్ కాలనీ, నాయికోటిబస్తీ, ముదిరాజ్ బస్తీలో ఏఈ ప్రవీణ్‌తో కలసి బుధవారం పర్యటించారు. మ్యాన్‌హోల్స్‌లో నిండిన వ్యర్థాలను తొలగించాలని జీహెచ్ఎంసీ సిబ్బందికి సూచించారు.

నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయండి



వినతిపత్రం అందజేస్తున్న స్టాలిన్‌నగర్ సంక్షేమ సంఘం సభ్యులు

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని స్టాలిన్‌నగర్ కాలనీలో రోడ్డు నెంబర్ 5,7లో నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలని జలమండలి మేనేజర్ సాయిచరితను స్టాలిన్‌నగర్ సంక్షేమ సంఘం సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్టాలిన్‌నగర్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ.. రోడ్డు నెంబర్ 5,7 లో సంవత్సరాల క్రితం వేసిన పురాతనమైన 8 ఇంచుల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ ఉందని, ఈ పైప్‌లైన్ చిన్నది కావడంతో మురుగు నీరు లీకై రోడ్డుపై ప్రవహిస్తోందని, దీంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాలనీలో జీహెచ్ఎంసీ వారి తరఫున కాలనీ అంతట పైప్‌లైన్లు వేశారని, రోడ్డు నెంబర్ 5,7 లో మాత్రమే వేయకుండా వదిలేశారని తెలిపారు. ఈ రోడ్డులో 12 ఇంచులతో కూడిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టి మురుగు సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరేందర్, సంగప్ప, శ్రీనునాయక్ తదితరులున్నారు.

రఘునాథ్ ఫౌండేషన్ క్రికెట్ టోర్నీ విజేత ‘కొత్తగూడ’



కొత్తగూడ జట్టుకు లక్ష నగదు, ట్రోఫీ అందిస్తున్న రఘునాథ్ యాదవ్ తదితరులు

గచ్చిబౌలి: రఘునాథ్ ఫౌండేషన్ క్రికెట్ టోర్నమెంట్‌లో కొత్తగూడ టీమ్ విజేతగా నిలిచి రూ. లక్ష నగదు అందుకుంది. కొండాపూర్‌లోని ఫయాజ్ క్రికెట్ అకాడమీలో కొద్ది రోజులుగా టోర్నమెంట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దాదాపు 52 టీమ్‌లు ఈ టోర్నీ పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్ కొత్తగూడ, వీఎస్‌పీ టీమ్‌ల మధ్య జరిగింది. విజేతగా నిలిచిన కొత్తగూడ జట్టుకు రూ.లక్ష చెక్, రన్నర్‌గా నిలిచి వీఎస్‌పీ జట్టుకు రూ.50 వేల చెక్‌లను రఘునాథ్ ఫౌండేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ అందించారు. నాలుగు, ఐదో స్థానంలో నిలిచిన జట్లకు రూ.25 వేలు అందజేశారు. ఉత్తమ బ్యాట్స్‌మెన్, ఉత్తమ బౌలర్, మ్యాన్ ఆఫ్ ది టోర్నీ లను జ్ఞాపికలను అందజేశారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న టీమ్‌లకు బ్యాట్ అందజేశారు. రాజకీయాలకు అతీతంగా టోర్నమెంట్ నిర్వహించామని, ప్రతిభను చాటేందుకు క్రికెటర్లు ఉపయోగించుకోవాలని రఘునాథ్ యాదవ్ సూచించారు. కార్యక్రమంలో మాజీ క్రికెటర్ ఫయాజ్, మాజీ కార్పొరేటర్ నీలం రవీందర్ ముదిరాజ్, బీజేపీ నాయకులు మొవ్వా సత్యనారాయణ, నరేష్ పాల్గొన్నారు.

15 గంటలు నో కరెంట్

ఏడో ఫేజ్‌లో విద్యుత్ లేక విలవిల!

- గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తప్పని ఇబ్బందులు
- పునరుద్ధరించాలని వేడుకున్నా కనికరించని వైనం
- విద్యుత్ అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం

కేపీహెచ్‌బీకాలనీ: వేసవికాలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ప్రజలు పడే బాధలు వర్ణనాతీతం. 24 గంటల పాటు నిరంతరాయ విద్యుత్ సరఫరాకు అలవాటు పడిన ప్రజలు ఏ కొద్దిసేపో విద్యుత్ సరఫరా లేకపోతే వస్తుందిలే అనే నమ్మకంతో వేచి చూస్తారు. కానీ ఏకంగా 15 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఇక అక్కడి ప్రజల కష్టాలు ఎవరికి చెప్పుకోవాలి. నేరుగా విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్‌చేసినా ఏ ఒక్కరూ స్పందించని వైనం.

- ఏకంగా 15 గంటల పాటు విద్యుత్ సరఫరా లేకుండా రాత్రి మొదలుకొని తెల్లవారుజాము వరకు కరెంటు కోసం వేచి చూసిన ప్రజలు అటు అధికారులను.. ఇటు ప్రభుత్వాన్ని నిందిస్తూ ఉసూరుమంటూ కాలం వెల్లదీశారు. ఈ సంఘటన ఏ మారుమూల గ్రామంలోనో చోటు చేసుకోలేదు. ఏకంగా హైటెక్‌సిటీకి కూతవేటు దూరంలోని కేపీహెచ్‌బీకాలనీ ఏడో ఫేజ్‌లో చోటుచేసుకుంది. ఇది విద్యుత్‌శాఖ అధికారుల హైటెక్ పనితీరుకు అద్దం పడుతోంది.
- వివరాల్లోకి వెళితే కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ ఏడో ఫేజ్‌లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు వర్షం రావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చుట్టుపక్కల అన్ని ప్రాంతాల్లోను వర్షం కురిసినంత సేపూ విద్యుత్ సరఫరా నిలిచిపోయి తిరిగి వచ్చింది. కానీ ఏడో ఫేజ్‌లో మాత్రం పోయిన కరెంటు మరుసటి రోజు ఉదయం 10 గంటల వరకూ రాకపోవడం గమనార్హం. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీవాసులు ఎవరికి వారుగా విద్యుత్‌శాఖ అధికారులకు ఫోన్ చేసినా స్పందన లేదు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్‌లు, కరెంటు మోటార్లు పనిచేయకపోవడంతో నీళ్లు లేక, గాలి లేక రాత్రంతా జాగారం చేయాల్సిన దుస్థితి నెలకొందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఫిర్యాదు చేసినా స్పందన లేదు



విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారు. మంగళవారం రాత్రి కాలనీలో విద్యుత్ నిలిచిపోవడంతో అనేకమార్లు ఫిర్యాదు చేసేందుకు యత్నించినా స్పందన కరువైంది. గతంలోనూ అనేక మార్లు ఇక్కడి విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసినా ఏఈతో పాటు ఇతర అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేకంగా ఏడో ఫేజ్‌కు కనీసం ఒక లైన్‌మెన్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. – అంజిబాబు, కాలనీ సెక్రటరీ

గాలివానతోనే అంతరాయం

మంగళవారం రాత్రి వీచిన ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఒకటీ రెండు చోట్లు ఫీడర్లలో ఫీజులు పోయి, లైన్‌లు కట్ అయిన చోట్ల మరుసటి రోజు ఉదయం మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించాం. ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం అంటూ ఉండదు. వేలాది కనెక్షన్లు ఉన్న చోట ఒకేసారి అందరూ ఫిర్యాదు చేస్తుంటే లైన్ బిజీగా ఉంటుంది తప్ప అందరి ఫిర్యాదులకు స్పందించి సమస్యలు పరిష్కరిస్తున్నాం. ఏడో ఫేజు పార్కువద్ద ఉన్న ఫీడర్‌కు మరమ్మతులు చేసినప్పటికీ మళ్లీ సమస్య తలెత్తడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాల్సి వచ్చింది. – శంకర్, బాలాజీనగర్ సెక్షన్ ఏఈ